ప్రజాశక్తి
సోమవారం 20 మే 2024
5
అల్లూరి సీతారామరాజు

కళాకారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో స్వరాజ నట రంజని మ్యూజికల్ ఆర్కెస్ట్రా కళాకారులను జిల్లా కళాకారుల సంక్షేమ సేవా సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాపుల క్రిష్ణారావు, లింగమూర్తిలు సన్మానించారు. ఈ సందర్భంగా కళాకారుల బృందం సభ్యులు అభినందనలు తెలియ జేసారు. ఈ కార్య క్రమంలో గిరిజన కళాకారుల సంక్షేమ సేవా సంఘం నాయకులు డూరు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న నాయకులు

సుందరయ్య ఆశయాలను సాధిస్తాం

- మన్యంలో పలుచోట్ల పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలు

పాడేరులో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: దేశంలో ప్రజాస్వామ్యక ఉద్యమాలను మరింత బలోపేతం చేయడంతోనే పుచ్చలపల్లి సుందరయ్యకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనరస తెలిపారు. అల్లూరి జిల్లా వ్యాప్తంగా పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. సిపిఎం శ్రేణులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాడేరు సిపిఎం జిల్లా కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అప్పల నరస మాట్లాడుతూ, 18 సంవత్సరాలు దాటిన వయోజనులంతా గ్రామసభల్లో భాగస్వామిగా ఉండాలని సుందరయ్య కోరుకునేవారని చెప్పారు. ఎన్నికల, న్యాయ వ్యవస్థ ఎలా పని చేయాలో.. మెరుగైన ఆధునిక విద్యా, వైద్య సదుపాయాలెలా ఉండాలో నిర్దిష్టంగా పేర్కొన్నారని చెప్పారు.రైతులు, పారిశ్రామిక కార్మికులు, వృత్తిదారుల హక్కులను తెలియజేశారన్నారు. ఆనాటికీ, నేటికీ పరిస్థితుల్లో చాలా మార్పులున్నప్పటికీ సుందరయ్య కన్న కల ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాణం నేడు ఒక కర్తవ్యంగా మన ముందుందన్నారు. సుందరయ్య కల నిజమవ్వాలంటే డబ్బు పాత్ర లేని ఎన్నికల వ్యవస్థ రావాలన్నారు. ప్రతి పార్టీకి ఎన్నికలకయ్యే ఖర్చును ప్రభుత్వాలే భరించాలని, ప్రజా ప్రతినిధులు దారి తప్పితే రీకాల్ హక్కు ప్రజలకుండాలని తెలిపారు. మతాన్ని రాజకీయాల్లో చొప్పించడాన్ని నిషేధించాలన్నారు. సిపిఎం పాడేరు మండల నాయకులు వంతాల దాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కామరాజు వరహాల బాబు, మత్యరాజు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, మండల నాయకులు పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, సుందరయ్య భూస్వామి కుటుంబంలో జన్మించినా అణిచివేతకు గురవుతున్న పీడిత ప్రజల కోసం తన జీవితాన్నే అంకితం చేసారని కొనియాడారు. మచ్చలేని మనిషిగా పేరు పొందారన్నారు. బడుగు బలహీన వర్గానికి అండగా నిలబడి అంటరానితనం వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశార్నారు. తనకు చెందిన స్వంత భూములన్ని పేదలందరికీ పంచిపెట్టిన మహా నేత సుందరయ్య అన్ని గుర్తు చేశారు. కార్మికులకు, కర్షకులకు, రైతు కూలీలకు సంఘాలు పెట్టి పేదల పక్షాన నిలబడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పాంగి రామన్న, కొర్రా మగ్గన్న, కిల్లో జగనాదం పాల్గొన్నారు.

పెదబయలు :మండల కేంద్రంలో సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, చట్టసభకు సైకిల్‌పై నాయకులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు, మండల కమిటీ సభ్యులు బొండా గంగాధరం, రామారావు, శర్బన్న పాల్గొన్నారు.

ఎటపాక : ప్రజా సమస్యలపై నిత్యం సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేయడం ద్వారా సుందరయ్య ఆశయాలను సాధిద్దామని సిపిఎం మండల కార్యదర్శి ఐ వి అన్నారు. ఆదివారం గుండాల కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జి హరి అధ్యక్షతన జరిగిన సభలో ఐవి మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, వర్గ పోరాటాల రథసారథి, ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య అడుగు జాడల్లో నడుస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ దోపిడీ వర్గాల నుంచి రక్షణకు ప్రజలను నిత్యం చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఇర్పా సత్యం, పులుసు బాలకష్ణ, ఆకిశెట్టి రాము, బుద్దుల భద్రయ్య, హరి, మాటూరి బాలకృష్ణ, సీసం అర్జున్, గద్దల హుస్సేన్, పసుపులేటి ప్రవీణ్, బీస్మారావు, మధు ,రఘు పాల్గొన్నారు.

విఆర్.పురంలో..

చింతూరులో నివాళి అర్పిస్తున్న నాయకులు

విఆర్ పురం : మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయం వద్ద పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా కమిటీ సభ్యులు పూనం. సత్యనారాయణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాజకీయం అంటే ప్రజాసేవ అని నిరూపించిన వ్యక్తిగా సుందరయ్య నేటితరం రాజకీయ నాయకులకు స్ఫూర్తి అన్నారు. సుందరయ్య కోరుకున్న సమసమాజం, కార్మికవర్గం హక్కుల సాధనకై ఉద్యమాలు ఉధృతం చేయాలన్నారు. బానిస సంకెళ్ళ నుంచి కార్మికవర్గానికి విముక్తి కలిగి,సమాన పనికి సమాన వేతనం, రైతాంగానికి గిట్టుబాటు ధర, వ్యవసాయ కార్మికులకు కనీస కూలి, పేద ప్రజలందరికి ఉపాధి ,ఉద్యోగ అవకాశాలు సాధించగలిగినప్పుడే సుందరయ్యకు నిజమైన నివాళి అన్నారు, కార్యక్రమంలో మండల నాయకులు పులి సంతోష్‌కుమార్ సోడి. మల్లయ్య. ఎన్. ప్రకాష్, లక్ష్మణరావు కార్యకర్తలు వెంకటరమణ, శ్రీరామ్ పాల్గొన్నారు..

చింతూరు : పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక శ్యామల వెంకటరెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, సీనియర్ నాయకులు వై.శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. స్వతంత్ర సమరయోధుడిగా, కమ్యూనిస్టు పార్టీ నేతగా, నిస్వార్థ రాజకీయ నాయకునిగా ప్రజల కోసం సుందరయ్య చేసిన సేవలను స్మరించుకుని కొనియాడారు.కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మురం రంగమ్మ,నాయకులు పాండురం సుబ్బారావు, కారం సుబ్బారావు, పోడియం లక్ష్మణ్, పెద్ద రాములు పాల్గొన్నారు.

అరుకులోయలో నివాళి అర్పిస్తున్న నాయకులు

రంపచోడవరం పుచ్చలపల్లి. సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా రంపచోడవరం సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన.సీతారాం పూలదండ వేసి ఘన నివాళులర్పించారు. కమ్యూనిస్టు నాయకునిగా, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడిగా, స్వాతంత్ర్య సమర యోధుడి .పుచ్చలపల్లి సుందరయ్య సేవలను కొనియాడారు. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడైన సుందరయ్య, కులవ్యవస్థను నిరసించారని, నిరాడంబరతతో ఆదర్శ జీవితం గడిపారన్నారు. సుదీర్ఘపార్లమెంటేరియన్‌గా, సైకిల్‌పై చట్టసభలకు వెళ్లిన ఏకైక నేతగా సుందరయ్య ఆదర్శనీయుడన్నారు. కార్యక్రమంలో పార్టీ రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మట్ల వాణిశ్రీ, ఈతపల్లి సిరిమల్లి రెడ్డి పాల్గొన్నారు.

కూనవరం : అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు తలగాని నాగరాజు పూల మాల వేశారు. అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ సుందరయ్య సేవలను కొనియాడారు కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, ఎంపీటీసీ సభ్యులు కారం జయసుధ, మాజీ ఎంపిటిసి సభ్యులు పాయం సత్యనారాయణ,మడెం బాబురావు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా చొంపి రహదారి

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గోతులమయంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రానికి కూత వేటు దూరంలో చొంపి రహదారి అధ్వానంగా మారింది. అడుగడున గోతులు ఏర్పడటంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన పూర్తిగా శిధిలావస్థకు చేరి రక్షణ గోడ కూలి పోవడంతో ఏ సమయంలో ఏమి జరుగుతుందోనన్న భయంతో వాహన చోదకులు ప్రయాణం సాగిసున్నారు. ఈ రోడ్డులో అరకులోయ మండలం చొంపి, సిరాగం, బస్కి, మాడగడ, హుకుంపేట మండలం బూర్జ, వేంగడ పంచాయితీలకు చెందిన వివిధ గ్రామాల గిరిజనులు నిత్యం అరకులోయ మండల కేంద్రానికి వివిధ పనులు నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షం పడితే చాలు గోతుల్లో వర్షపు నీరు చేరి రోడ్డు ప్రమాదకరంగా మారుతోంది. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు సార్లు విన్నవించినా పట్టించు కునే నాథుడే కరువయ్యాడని స్థానికులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గిరిజనులు డిమాండ్ చేశారు.

సంయమనం పాటించాలి

రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న చింతూరు సీఐ గజేంద్రనాయుడు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి, జూన్ ఒకటి తర్వాత ఎగ్జిట్ ఫలితాలు, 4న ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో రాజకీయ నాయకులు సంయమనం పాటించాలని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు సూచించారు. ఆదివారం రాజవొమ్మంగి సర్కిల్ కార్యక్రమంలో మండలంలోని అన్నీ రాజకీయపార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం ఎన్నికల కోడ్‌తోపాటు సిఆర్‌పిసి సెక్షన్ 144 అమలులో ఉన్నందున ఎక్కడ ఎటువంటి అల్లర్లు, గొడవలకు తావులేకుండా ప్రజలందరూ సంయమనం పాటించాలని సూచించారు. కౌంటింగ్ తర్వాత విజయోత్సవ సమావేశాలు, ర్యాలీలు నిషేధమన్నారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్‌ఐలు ఎస్ వెంకయ్య, రఘునాథరావు,పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

చింతూరు : వచ్చేనెల 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కూడా గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేవిధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని సిఐ గజేంద్ర కుమార్ సూచించారు .ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఫలితాలు విడుదలైన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలు నిర్వహణ, బాణసంచా పేల్చడం, హింసాత్మక, కవ్వింపు చర్యలకు పాల్పడడం, బెట్టింగులకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రిస్తే కఠిన చర్యలు

రంపచోడవరం : ఎన్నికల కోడ్, సిఆర్‌పిసి సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉన్నందున ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు వాటి ఉల్లంఘనకు పాల్పడకుండా ఉండాలని ఎస్‌ఐ మోహన్‌కుమార్ సూచించారు. నలుగురు కన్నా ఎక్కువ మంది ఒక చోట గుమికూడి ఉండడం, అనుమతులు లేకుండా, బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్పడం నిషేధమన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీ నేతలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయటం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులను పెట్టి ప్రచారం చేయటం నేరమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరూ పోలీస్ వారికి సహకరించాలని ఎస్‌ఐ మోహన్‌కుమార్ కోరారు.

150 మందికి వైద్య సేవలు

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మందికి వైద్యసేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద జీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్లు టి.వి.సుబ్బారావు, దాసరి ఉమామహేష్. రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్ కుమార్ పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈసందర్భంగా 53మందికి రక్తపరీక్షలు, ఏడుగురికి థైరాయిడ్ పరీక్షలు,12మందికి ఫిజియథెరపీ, 20మందికి ఎక్స్‌రేలు, ఇద్దరికి ఇసిజి పరీక్షలు చేసినట్లు స్వామీజీ తెలిపారు. ప్రతిఆదివారం నిర్వహించే వైద్యశిబిరాల ద్వారా రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా వైద్యశిబిరానికి వచ్చే రోగులు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

ధ్రువపత్రాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పదవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ అధికారులు సకాలంలో మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా పనుల్లో ఉండటంతో సంబంధిత రెవెన్యూ అధికారులు కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో ఆలస్యం జరగడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకోవడానికి పలు ఇబ్బందులు పడ్డారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సకాలంలో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సిహెచ్ రామ్మూర్తి, పాపారావు, నూకరాజు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

తాగునీటి సమస్యపై

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గిరిజన ప్రజలు ఖాళీ బిందెలతట వినూత్న రీతిలో చేతులు జోడించి మండలంలోని రొంపల్లి పంచాయతీ ఎగువగుడ్డి, గాదిలోవ గ్రామాల గిరిజన ప్రజలు ఆదివారం ఆందోళన చేపట్టారు. తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సోమ్మెల అప్పలరాజు, రైతు సహకార సంఘం ప్రతినిధులు కె. సింహాచలం, కె.సన్యాసిరావు మాట్లాడుతూ, తాగునీటి సౌకర్యం లేక మండుటెండల్లో సుదూర ప్రాంతంలో ఉన్న కలుషితమైన గెడ్డ నీటిని ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తక్షణమే తమ గ్రామాలకు పైపులైన్ లేదా బోరు బావుల ద్వారా తాగునీటి సరఫరా చేయలని వారు డిమాండ్ చేశారు. ఎర్రబోయిన వీధి నుండి ఎగ్గువగుడ్డి గ్రామానికి పైపులైన్ ఏర్పాటు చేసి మూడు టేప్‌లు ఏర్పాటు చేశారని, మరమ్మతుకు గురి కావడంతో కిలోమీటర్ దూరంలో ఉన్న గెడ్డకు వెళ్లి కలుషితమైన నీటిని తెచ్చుకొని ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పి.సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు 21, 22 తేదీల్లో కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు ఈ నెల 21, 22 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ నెల 21న బాలురకు, 22న బాలికలకు ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఆభ్యర్థులు పాడేరు గురుకుల కళాశాలలో జరిగే కౌన్సిలింగ్ కు 21న బాలురు, 22న బాలికలు హాజరు కావాలని సూచించారు.

చంద్రబాబును కలిసిన అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శనివారం హైదరాబాద్‌లో ఆ పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు, పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత మర్యాద పూర్వకంగా కలిసి పసుపుగుచ్చం అందజేశారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పోలింగ్ సరళి, అనుకూల ఓటింగ్, పోలింగ్ శాతాన్ని పరిగణలోకి తీసుకుని తాను విజయం సాధిస్తానని ఆమె చంద్రబాబుకు వివరించారు.కూటమి నాయకులు , కార్యకర్తలు అహర్నిశలు కష్టించి పని చేశారని ఆమె బాబు దృష్టికి తీసుకువెళ్లారు.

తడిసి ముద్దయిన తూనికాకు

- అకాల వర్షానికి కళ్లాల్లో నీటమునిగిన బీడీ ఆకుల కట్టలు
- నాణ్యత చెడి, నష్టం వస్తుందని కాంట్రాక్టర్ల ఆందోళన

ప్రజాశక్తి-చింతూరు : గత రాత్రి కురిసిన భారీవర్షానికి చింతూరు మన్యంలోని పలు కళ్లాల్లో ఆరబెట్టిన తూనికాకు కట్టలు తడిసి ముద్దవ్వడంతోపాటు, వర్షపునీటిలో మునిగిపోయాయి. నాణ్యమైన బీడీ ఆకులకు నెలవుగా ప్రసిద్ధి చెందిన చింతూరు ఏజెన్సీలో అకాల వర్షానికి రూ. లక్షల విలువ చేసే తూనికాకు కట్టలుగా తడిసి పోవడంతోపాటు వర్షపునీటిలో మునిగి ఉండడంతో వాటిపై మచ్చలు ఏర్పడిన నాణ్యత చెడుతుందని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు.కాగా బీడీ ఆకుల కళ్లాలను ఎత్తయిన, ఏటవాలు ప్రదేశాల్లో ఎంతటి వర్షం వచ్చినా నీటి నిల్వ ఉండని ప్రాంతాల్లో ఏర్పాటు చేయకుండా, లోతట్టు ప్రదేశాల్లో ఏర్పాటు చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు అంటున్నారు. ఎక్కడ వర్షపునీరు అక్కడే నిలిచిపోవడంతో నేలపైనే ఆరబెట్టిన తూనికాకు కట్టలన్నీ మట్టి పట్టడంతోపాటు ఉదయానికి కూడా వర్షపునీటిలో మునిగి ఉన్నాయని అంటున్నారు. ముందస్తు జాగ్రత్తలు లేకుండా కళ్లాలను ఏర్పాటు చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అంటున్నారు. మండలంలోని. కల్లేరు, మధుగురు, సూరన్న గొంది, గూడూరు తదితర గ్రామాల్లోని తూనికాకు కళ్లాల్లో బీడిఆకుల కట్టలన్నీ నీట మునిగి ఉండడంతో వాటన్నింటినీ ఏరి, కట్టల్లోని నీరు పోయేలా చేసి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

వర్షపునీటితో తేలియాడుతున్న బీడీ ఆకుల కట్టలు

అడ్డదారిలో ఒడిశాకు.. ఆంధ్రా ఆదాయానికి గండి

ఆంధ్రాలో తూనికాకు కట్టల ధర, ఒడిశా కంటే తక్కువగా ఉండడంతో తూనికాకును సేకరించిన స్థానికులు వాటిని సరిహద్దు దాటించి, ఒడిశాలో విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆంధ్రాలో 50 ఆకుల తూనికాకు కట్టకు రూ.4లు చెల్లిస్తుండగా, అదే కట్టకు ఒడిశాలో రూ.ఐదు చెల్లిస్తున్నారు. దీంతో చింతూరు మన్యంలో తూనికాకు సేకరణకు కళ్లాలను ఏర్పాటు చేసినప్పటికీ, స్థానికులు తాము సేకరించిన తూనికాకులను ఆంధ్రాలో కాకుండా, సీలేరు నదిని దాటించి ఒడిశాలోని మోటు పంచాయతీకి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. అంతేకాక అక్కడ తక్షణమే డబ్బులు చెల్లిస్తుండడంతో ఎక్కువమంది తూనికాకు సేకరణదారులు సరిహద్దును దాటించేస్తున్నారు. దీంతో ఒడిశాలో తూనికాకు సేకరణ ద్వారా కోట్లలో వ్యాపారం జరుగుతుండగా, చింతూరు ఏజెన్సీలో లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. తూనికాకు ధరను పెంచడంతోపాటు, చింతూరు మన్యంలోని తూనికాకులు ఒడిశా తరలిపోకుండా అడ్డుకోవడంలో అటవీ, ఇతర శాఖల వైఫల్యమే దీనికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నీటిలోని కట్టలను సేకరిస్తున్న కూలీలు

వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : మండలంలోని ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది, సాయంత్రం వరకు తీవ్రమైన ఎండ కాయడంతోపాటు వడగాలులు వీయడంతో మండలవాసులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. సాయంత్రం వేళ వాతావరణంలో ఆకస్మికంగా మార్పులు చోటుచేసుకుని, మబ్బులు కమ్ముకొని ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది, తీవ్రమైన ఎండలకు అల్లాడుతున్న మన్యవాసులంతా వర్షంతో వాతావరణం చల్లబడడంతో సేదతీరారు.

రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

ప్రారంభానికి నోచని అంగన్‌వాడీ కేంద్రం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. సుమారు రూ.6 లక్షలతో నిర్మించిన ఈ కేంద్రాన్ని దాదాపు ఏడాదికాలంగా ప్రారంభించక పోవడంతో ఆయా ప్రాంతాల చిన్నారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతానికి సంబంధించిన కేంద్రాన్ని అద్దె కొంపలో కేంద్రాన్ని నడుపుతున్నారు. నిర్మాణం పూర్తి చేసుకుని అన్ని హంగులతో ముస్తాబైనా ప్రారంభించకపోవడం విశేషం. ఈ విషయమై సమగ్ర శిశు అభివృద్ధి శాఖ సూపర్వైజర్ కనకదుర్గను వివరణ కోరగా గుత్తేదారునికి బిల్లు చెల్లించక పోవడంతో తాళాలు ఇవ్వలేదన్నారు. దీంతో అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించలేదని తెలిపారు.

చంద్రబాబును కలిసిన అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శనివారం హైదరాబాద్‌లో ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పోలింగ్ సరళి, అనుకూల ఓటింగ్, పోలింగ్ శాతాన్ని పార్టీ అధినేతకు తెలిపారు. తాను విజయం సాధిస్తానని ఆమె చంద్రబాబుకు వివరించారు. కూటమి నాయకులు , కార్యకర్తలు అహర్నిశలు కష్టించి పని చేశారని ఆమె బాబు దృష్టికి తీసుకువెళ్లారు.

హాకీ శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి హాకీ క్రీడా మైదానంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సమ్మర్ హాకీ శిక్షణ క్యాంప్‌ను హాకీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి వెంకటరమణ కోరారు. కోచ్ రాంబాబు పర్యవేక్షణలో ప్రతిరోజు ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు హాకీలో ప్రత్యేక తర్ఫీదును ఇవ్వడం జరుగుతుందన్నారు. బియస్ హాకీ ఫౌండర్ సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి తాతాజీ, నానాజీ, రామచంద్రరావు, దాతల ఆధ్వర్యంలో ప్రతిరోజు క్రీడాకారులకు అల్పాహారం అందిస్తున్నామన్నారు. క్రీడాకారులకు కావలసిన క్రీడా సామాగ్రిని కూడా దాతల సహాయంతో అందిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు.

కొనసాగిన సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో ఆదివారం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కథలు చదివించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ స్నేహం విలువ తెలియచేసిన కథను పిల్లలకు చెప్పారు. అనంతరం పిల్లలతో దేశ భక్తి గీతాలు పాడించారు. చివర్లో రిక్రియేషన్ గేమ్ ఆడించారు.

ఎన్‌టిఆర్ స్టేడియంలో శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో నింజస్ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు కొనసాగుతుంది. అకాడమీ డైరెక్టర్లు సుతాపల్లి శ్రావణ్, వెలగా జగన్నాథ్, పారుపల్లి శ్రీనివాస్, సీనియర్ కోచ్ శేఖర్, ఎన్ఎస్ఎన్ మహిళా కోచ్‌లు కృష్ణవేణి, ప్రియాంకలతో పాటు 70 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. కరాటే, బాక్సింగ్, యోగా, కిక్ బాక్సింగ్, వాలీబాల్, షటిల్, చెస్, కేరమ్స్ వంటి ఇండోర్ గేమ్స్ వాటిలో శిక్షణ ఇస్తున్నారు. చెట్టుపల్లి, గొలుగొండ, మాకవరపాలెంలో కూడా క్యాంప్‌లు జరుగుతున్నాయని శాప్ కోచ్ అబ్బు తెలిపారు.

ఘనంగా కుంతీమాధవస్వామి చందనోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభంలోని శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కుంతీ మాధవస్వామికి ఆదివారం చందనోత్సవ కార్యక్రమాన్ని భక్తులు, పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమిలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోదరుడు మహేష్, స్థానిక ఎంపిపి రాంబాబు, పద్మనాభం ఎంపిటిసి సభ్యులు కె.లక్ష్మి, సర్పంచ్ టి.పాప తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి జంక్షన్.. టెన్షన్...

- హైవేపై వాహనాల రద్దీ
- రోడ్డు దాటాలంటే భయం..భయం..
- నిత్యం ప్రమాదాలు

ఉపమాక అర్ది జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న వాహనాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై రెండు ప్రధాన జంక్షన్లలో రోడ్డు దాటాలంటే భయం భయంగా మారింది. ఎప్పుడు వాహనాల రాకపోకల రద్దీతో జాతీయ రహదారి ఉండటంతో రోడ్డు దాటాలంటే జనం హడలి పోతున్నారు. నక్కపల్లి జాతీయ రహదారిపై ఉపమాక వెళ్లే అర్ది జంక్షన్, కాంప్లెక్స్ కూడలి జంక్షన్ లు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

నక్కపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు సాగించాలంటే బస్సు ఎక్కేందుకు నక్కపల్లి రావాల్సిందే. కూలి పనులు, వివిధ వృత్తులు చేసుకునేవారు, విద్యార్థులు, ప్రయాణికులు రెండు జంక్షన్ల వద్ద రోడ్డు దాటాలంటే వణికి పోతున్నారు. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని రోడ్డు దాటిన తర్వాత హమ్మయ్య అని అనుకుంటున్నారు. చీకటి పడితే ఆ సమయంలో రోడ్డు దాటాలంటే సాహసమనే చెప్పాలి. విశాఖ వైపు వెళ్లే మార్గంలో ప్రయాణికులు బస్సు ఎక్కాలంటే రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు ఎలమంచిలి వైపు బస్సు ఎక్కాలంటే రోడ్డు దాటి ఎక్కవలసి వస్తుంది. కాంప్లెక్స్ ఉన్నప్పటికీ బస్సులు కాంప్లెక్స్ లోకి రాలేదు. దీంతో తప్పని పరిస్థితిలో భయపడుతూ రోడ్డు దాటవలసి వస్తుంది. రోడ్డు దాటే సమయంలో ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

హైవేపై అడ్డంగా ఆటోలు

ముఖ్యంగా ఉపమాక వెళ్లే అర్ది జంక్షన్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఉపమాక మార్గం గుండా బైకులు, ఇతర వాహనాలు హైవే ఎక్కే సమయంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉపమాక అర్ది జంక్షన్ వద్ద హైవేపై ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటోలు రోడ్డుపై అడ్డంగా నిలుపుదల చేయడంతో ఉపమాక మార్గం గుండా వచ్చే బైక్ లు, ఇతర వాహనాలు రోడ్డుపై జీబ్రా లైన్ దాటి మార్గ మధ్యలోకి రావలసి వస్తుంది. ఈ సమయంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. ఇప్పటికే ఈ జంక్షన్లో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అనేకమంది మృత్యువాత పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యంగా ఉపమాక అర్ది జంక్షన్ వద్ద హైవేపై ఆటోలను నిలుపుదల చేయకుండా పోలీసులు చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ పెరిగింది. దానికి తోడు స్పీడు నియంత్రణ లేకుండా పోయింది. కనీసం జంక్షన్ల వద్ద కూడా వాహనాలు స్పీడ్ తగ్గించని పరిస్థితి నెలకొంది. రెండు జంక్షన్ల వద్ద అప్పుడప్పుడు పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. పోలీసులు ఉన్న సమయంలో జంక్షన్ వద్ద ఆటోలు నిలుపుదల చేయకుండా, వాహనాల రద్దీ లేకుండా చర్యలు చేపడతారు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని అప్పుడప్పుడు కాకుండా ప్రతిరోజు రెండు ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ పోలీస్ లను నియమించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, అదేవిధంగా నక్కపల్లి జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భయపడుతూ రోడ్డు దాటుతున్న పాదచారులు

వేడుకగా అన్నమయ్య సంకీర్తన పోటీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకానగర్‌లోని పబ్లిక్ లైబ్రరీలో శృతిలయ వ్యవస్థాపకులు వి.ప్రభాకర్ సారధ్యంలో అన్నమాచార్యుని జయంతి సందర్భంగా అన్నమాచార్య సంకీర్తన పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ద్వారం త్యాగరాజు జ్యోతి వెలిగించి సంకీర్తన పోటీలను ప్రారంభించారు. నాలుగు విభాగాల్లో 300 మంది కళాకారులు పాల్గొన్నారు. అనంతరం సభికులను ఉద్దేశించి ద్వారం త్యాగరాజు ప్రసంగిస్తూ సరస్వతి అమ్మవారి ప్రతిరూపంగా సంగీతం ఆవిర్భవించిందని, ఏ కళాకారుడికైనా శ్రద్ధ, ఏకాగ్రత, సాధన ఎంతో అవసరమన్నారు. సాధనతోనే ఉత్తమ సంగీత కళాకారులుగా రాణిస్తారని తెలిపారు. తేనె వంటి తెలుగు పదాలతో శ్రీవెంకటేశ్వర స్వామి వారిని సంకీర్తన రూపంలో కీర్తించిన ఘనత ఒక అన్నమాచార్యునికే దక్కిందన్నారు. మంచి కార్యక్రమాన్ని చేపట్టిన శృతిలయ సంస్థ నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, శృతిలయ సంస్థ కార్యదర్శి ఎంఎస్.మాధవ్, కొంతాల రాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సిహెచ్.వి.సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, కె.మంగాల తదితరులు పాల్గొన్నారు. నగరానికి చెందిన శాస్త్రీయ సంగీత ప్రముఖులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అధిక సంఖ్యలో పోటీదారులు, సంగీత ప్రియులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 23వ తేదీన అన్నమాచార్యుని జయంతి రోజున సాయంత్రం 5.30 గంటలకు పబ్లిక్ లైబ్రరీలో ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులను అందజేయనున్నట్లు శృతిలయ అధ్యక్షులు వి.ప్రభాకర్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జాతీయ రహదారిపై వేంపాడు టోల్ గేట్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గుంటూరు జిల్లా ఏటి అగ్రహారం ఫాతిమా నగర్‌కు చెందిన కంతటి నవీన్ (21), తన స్నేహితుడు తొలిచూరి వంశీకృష్ణ తో కలిసి బైక్ పై 17న అరకు వెళ్లారు. అరకు నుండి తిరిగి శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వేంపాడు టోల్ గేటు టోల్గేట్ దాటాక ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. నవీన్ పై నుంచి బస్సు వెళ్లడంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. వంశీకృష్ణ తీవ్రంగా గాయపడటంతో తుని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గఫూర్ తెలిపారు.

13 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏటిగైరంపేట వద్ద 13 కేజీల గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసినట్లు గొలుగొండ ఎస్సై కృష్ణారావు తెలిపారు. ఏటిగైరంపేట వద్ద తనిఖీల్లో భాగంగా ముగ్గురు వ్యక్తుల వద్ద ఈ గంజాయి పట్టుబడిందన్నారు. వీరిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

లయన్స్ క్లబ్ రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -గాజువాక : సామాజిక సేవలో భాగంగా గాజువాక లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన జగ్గు జంక్షన్ కూడలిలోని క్లబ్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ మాట్లాడుతూ, వేసవిలో రక్త నిల్వలు తక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం చాలక చాలామంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోగులకు అండగా ఉండడం కోసం ప్రాంతాల వారీగా శిబిరాలు నిర్వహించి, ప్రజా చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేదరిక నిర్మూలన, అక్షరాస్యత సాధన, బాల్య వివాహాలను అరికట్టడం, పోలియో నిర్మూలన వంటి కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా తమ క్లబ్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి వెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి సత్యాల కోటేశ్వరరావు, గాజువాక క్లబ్ కార్యదర్శి కృష్ణకుమార్, జీవన్ బాబు, అచ్యుతరావు, నున్న శ్రీనివాసరావు, బోయిన బాబూరావు, తిప్పల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. లయన్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్త దాతల నుంచి రక్తాన్ని సేకరించారు.

చిత్రకళా పోటీలతో సృజనాత్మకత

ప్రజాశక్తి -ములగాడ : చిత్ర కళా పోటీల్లో పాల్గొనడం ద్వారా సృజనాత్మకత వెల్లివిరుస్తుందని, ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురంలోని ప్రకాష్‌నగర్ శాఖా గ్రంథాలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం ఆమె పాల్గొని మాట్లాడారు. చిత్రకళకు 64 కళల్లో అత్యున్నత స్థానం ఉందని, చిత్రాన్ని ఆవిష్కరించడంలో గల నేర్పు, రంగుల కలయిక చిత్రకారుని ప్రతిభను, కళా దృష్టిని తెలియజేస్తాయని చెప్పారు. చిన్నతనం నుంచి విద్యార్థులకు చిత్రకళలో మెళకువలు, పాఠశాలల్లో, వివిధ శిక్షణ శిబిరాల్లో నేర్పాలని అన్నారు. రాజా రవి వర్మ, వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజు వంటి ప్రముఖ చిత్రకారులను గురించి చిన్నారులు తెలుసుకోవాలన్నారు. అనంతరం "గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు" అనే అంశంపై సీనియర్ విద్యార్థులకు, "అందమైన ప్రకృతి దృశ్యం" అనే అంశంపై జూనియర్ విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. పోటీలలో 20 మంది పాల్గొన్నారు. కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, సిద్ధార్థ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల కథలను పఠించారు.

పెద్దకొత్తూరులో నూకాంబిక అమ్మవారి పండగ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి పెద్దకొత్తూరులో ఆది ఆంధ్ర యువజన సేవా సంఘం ఆధ్వర్యాన నూకాంబిక అమ్మవారు పండుగ నిర్వహించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వికెపిసిపిఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, జివిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్రావు, చంద్రమౌళి, 47వ వార్డు నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని ఓ సినిమా థియేటర్ లోపలి భాగం

వెలవెలబోతున్న థియేటర్లు

నెల రోజులుగా ఖాళీగానే దర్శనం
విశాఖలో ఎన్నడూ లేనంత గడ్డు పరిస్థితి
కొత్త సినిమాలు లేకపోవడమే కారణమంటున్న సినీ ప్రియులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో ఎన్నడూ లేనంత గడ్డు పరిస్థితిని సినిమా థియేటర్లు ఎదుర్కొంటున్నాయి. ప్రేక్షకులు రాక వెలవెలబోతున్నాయి. వాస్తవానికి నగరంలోని దాదాపు అన్ని థియేటర్లూ ఎసి సౌకర్యం కలిగినవే. మండువేసవిలో వీటి ఆక్యుపెన్సీ బాగానే ఉండాలి. అయితే దాదాపు నెల రోజులుగా థియేటర్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం కొత్త సినిమాలు, పెద్ద హీరోల చిత్రాలు విడుదల కాకపోవడమేనని పలువురు చెబుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం కొత్త సినిమాలు విడుదలకాని పరిస్థితుల్లో.. గతంలో విడుదల కాబడి, హిట్టు చిత్రాలుగా పేరుపొందిన వాటిని రీ రిలీజ్ చేసేవారు. అయితే ఆ తర్వాత ఈ విధానానికి ఫుల్ స్టాప్ పడింది. పాత సినిమాలు మళ్లీ మళ్లీ వేయటం జరగటం లేదు. కొత్త సినిమాలు మాత్రమే విడుదల కావాలి, అవి మాత్రమే ప్రదర్శింపబడాలి. లేకుంటే ప్రేక్షకులు థియేటర్ల వైపు కన్నెత్తి చూడని పరిస్థితి 20 ఏళ్లుగా ఉంది. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం విడుదల కాబడ్డ సినిమా సూపర్ డూపర్ హిట్ అయితే వంద రోజులు, 200 రోజులు, కొన్నయితే ఏడాది పాటు కూడా ప్రదర్శింపబడిన సందర్భాలు ఉండేవి. అందుకే అప్పట్లో సినీ హీరోల అభిమానులు తమ హీరో చిత్రం అన్ని రోజులు, ఇన్ని రోజులు ప్రదర్శించబడిందని, కలెక్షన్ల వర్షం కురిపించిందని గొప్పగా చెప్పుకునేవారు. దరిమిలా ఆ పరిస్థితి మారింది. చిత్రం ఎన్ని రోజులు ప్రదర్శింపబడింది అనేది కాకుండా.. ప్రదర్శింపబడిన రోజులు తక్కువగా ఉన్నప్పటికీ కలెక్షన్ల పరంగా వసూళ్లు ఏ రేంజ్‌లో ఉన్నాయో చెప్పడం ప్రారంభమైంది. కలెక్షన్లు అధికంగా రావాలంటే ఎక్కువ థియేటర్లలో సినిమా రిలీజ్ కావడం, అది కూడా పెద్ద హీరో చిత్రం కావడం ఉంటేనే సాధ్యపడుతుంది. అతికొద్ది మంచి చిత్రాలకు దీనిని మినహాయించవచ్చు. అయితే ప్రస్తుతం థియేటర్లకు ప్రేక్షకులు కరువు కావడానికి ఏకైక కారణం కొత్త సినిమాలు ఆశించిన స్థాయిలో విడుదల కాకపోవడమేనని తెలుస్తోంది. థియేటర్లలో ఈసరికే నడుస్తున్న చిత్రం బాగా లేనప్పటికీ థియేటర్ నడవాలి కాబట్టి కలెక్షన్‌తో సంబంధం లేకుండా అదే సినిమాను ప్రదర్శనకు కొనసాగించే పరిస్థితి నెలకొంది. ఇది కేవలం విశాఖ నగరానికి సంబంధించినది మాత్రమే కాదు.. తెలుగు సినిమా రంగానికంతటికీ ఇబ్బందిగా మారింది.

నష్టాలతో మూత

పొరుగున ఉన్న తెలంగాణా రాష్ట్రంలో కొత్త సినిమాలు రిలీజ్ కానందున, థియేటర్లకు కలెక్షన్లు లేని కారణంగా, నష్టాలతో నడపడం ఇబ్బందికరంగా మారడంతో పది రోజులు పాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లను మూసివేస్తూ అక్కడి ఎగ్జిబిటర్లు నిర్ణయం తీసుకున్నారు. అమలు జరుపుతున్నారు. విశాఖ నగరంలో కూడా ఈ పరిస్థితి వచ్చినా రావచ్చు. నిజానికి టీవీలు వగైరా మాధ్యమాలు రావడంతో సినిమా థియేటర్ల కలెక్షన్లు దాదాపు మందగించాయి. మూడు నాలుగు దశాబ్దాల క్రితం థియేటర్లు లాభాల్లో నడిచేవి. ఆ తర్వాత నుంచి నష్టాల బాట పట్టాయి. ఇప్పుడు నష్టాలు పీకల లోతుకు చేరాయి.

అందుకే అనేకమంది ఎగ్జిబిటర్లు తమ థియేటర్లను మూసివేశారు. కొన్ని థియేటర్లు కల్యాణ మండపాలుగా, వాణిజ్య భవనాలుగా రూపు చెందాయి. కొద్ది మాసాల క్రితం గోపాలపట్నంలోని శంకర, సత్యం థియేటర్లను పూర్తిగా మూసివేశారు. ఇదే పరిస్థితి మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఉంది. నగర పరిధిలో 40 వరకు థియేటర్లు ఉన్నాయి. అటు అనకాపల్లి, ఇటు భీమిలి కలుపుకుంటే గ్రేటర్ విశాఖ పరిధిలో వీటి సంఖ్య 45 వరకు ఉంటుంది. ఒకప్పుడు ఇదే ప్రాంతంలో సుమారు 60 నుంచి 70 థియేటర్లు ఉండేవి. అవి ఒక్కొక్కటికీ మూతపడుతూ వస్తున్నాయి.

మహనీయుడు సుందరయ్య

భావితరాలకు ఆయన మార్గదర్శి
వర్ధంతి సభలో పలువురు వక్తల ఉద్ఘాటన
అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'మతోన్మాదం-రాజ్యాంగం-ప్రస్తుత సవాళ్లు'పై స్మారకోపన్యాసం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ విలేకరి

పేదల పెన్నిధి, ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య మార్గం అనుసరణీయమని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భావితరాలకు ఆయన మార్గదర్శి అని ఉద్ఘాటించారు. ఆయన స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఆదివారం ఉదయం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు 'మతోన్మాదం - రాజ్యాంగం - ప్రస్తుత సవాళ్లు' అన్న అంశంపై స్మారకోపన్యాసం చేశారు. లౌకికవాదం, సామాజిక న్యాయానికి విఘాతం కలిగిస్తూ దేశంలో ప్రధాని మోడీ పదేళ్లుగా పాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. ఈ క్రమంలో నేటి యువతరానికి సుందరయ్య జీవిత ఆదర్శాలు, ఆయన చేసిన రచనలు ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. సుందరయ్యకు నిజమైన నివాళి అంటే రాజ్యాంగ హక్కుల రక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పాటుపడటమేనన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ భారతదేశం లౌకిక రాజ్యమని రాజ్యాంగంలో పొందుపరచబడిందన్నారు. నేడు రాజ్యాంగంపై కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. దర్యాప్తు సంస్థలను సైతం తమ ఆధీనంలో పెట్టుకొని ఆడిస్తోందన్నారు. రాజ్యాంగానికి ప్రమాదం వస్తే రక్షించాల్సిన రెండే రెండు వ్యవస్థలు న్యాయ వ్యవస్థ, మీడియా అని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీ వచ్చి రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిన సమయంలో న్యాయ వ్యవస్థ, మీడియా కలిసి దేశాన్ని రక్షించాయని తెలిపారు. గతంలో భారత రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిన సమయంలో సుప్రీంకోర్టు వ్యవహరించిన తీరును గుర్తుచేశారు. నేడు మోడీ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన రెండు వ్యవస్థలనూ తన ఆధీనంలో పెట్టుకున్నారన్నారు. మీడియా మొత్తం కార్పొరేట్ల ఆధీనంలోకి వెళ్లిపోయిందని అన్నారు. 2018లో ఎన్నికల బాండ్లపై కోర్టులో పిటిషన్ వేస్తే బిజెపి పొందాల్సిన లబ్ధినంతా పొందిన తర్వాత 2024లో కోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఈ మధ్య కాలంలో సుప్రీంకోర్టు దేశంలో చాలా దురాగతాలను ప్రోత్సహించే విధంగా తీర్పులిచ్చిందన్నారు. నేడు అప్పుడప్పుడూ మాత్రమే ఒకటి రెండు మంచి తీర్పులు వస్తున్నాయన్నారు. నేటి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు.

సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న వి.శ్రీనివాసరావు, అజశర్మ

హాజరైన సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, నగర వాసులు

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం అల్లూరి విజ్ఞాన కేంద్రాన్ని ఇదే రోజున ప్రారంభించామన్నారు. సామాజిక తరగతులను సమీకరించే కేంద్రంగా ఇది రూపుదిద్దుకుంటోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, బి.జగన్, నాయకులు రెడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా ఎర్నిమాంబ జాతర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం 44వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ జంక్షన్‌లో ప్రసిద్ధి చెందిన శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు వందలాది మంది తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. దక్షిణ ఎమ్మెల్యే, వైసిపి అసెంబ్లీ అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్, అలాగే దక్షిణ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌లు వచ్చి ఎర్నిమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. జాతర సందర్భంగా సర్వాంగ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దారని, విద్యుత్ అలంకరణలతో జ్ఞానాపురం ప్రాంతం అంతా భక్తులతో సౌభాగ్యమానంగా వెలుగుతోందని ఆనందం వ్యక్తపరిచారు.

దక్షిణ నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాలలో ఇర్నిమాంబ ఆలయం ఒకటి అన్నారు. భవిష్యత్తులో భక్తులకు మరెన్నో సౌకర్యాలు అందేలా ఆలయం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి కృప కటాక్షాలతో వచ్చే సంవత్సరం జాతర మహోత్సవాలను ఘనంగా జరుపుకోవడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పాత నగరంలోని టౌన్ హాల్

రూ.కోట్లతో పునరుద్ధరించబడిన టౌన్ హాల్ మళ్లీ శిథిలావస్థకు చేరుతోందా..?

- నిర్వహణా లోపంతో చారిత్రక కట్టడానికి ముప్పు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

రూ.కోట్లతో పునరుద్ధరించబడిన టౌన్ హాల్ మళ్లీ శిథిలావస్థకు చేరుతోందా ? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ఇప్పటికైనా దీని నిర్వహణపై మరింత దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. విశాఖ కీర్తి శిగలో చారిత్రక కట్టడాలు ఎన్నో ఉన్నాయి. ఈ కట్టడాలు విశాఖకు వన్నె తెచ్చాయి శతాబ్దాల క్రితం నిర్మించినవే అయినప్పటికీ నేటికీ చెక్కు చెదరకుండా అబ్బుర పరుస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే నాటి నైపుణ్యానికి ప్రభావానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. కలెక్టరేట్, కెజిహెచ్, ఆంధ్ర విశ్వ కళాపరిషత్, ఎవిఎన్, క్వీన్ మేరీ స్కూల్, కమిషనరేట్, జడ్జి కోర్టులు, ఆంధ్ర మెడికల్ కళాశాలలు చరిత్రకు ఆనవాళ్లుగా బాసిల్లుతూ నగరంలో మనకు కనిపిస్తున్నాయి. అయితే ఇటువంటి చారిత్రక ప్రసిద్ధి చెందిన మరొక రెండు కట్టడాలు పాత నగరంలో ఉన్నాయి. వాటిలో ఒకటి టౌన్ హాల్ కాగా, మరొకటి పాత మున్సిపల్ కార్యాలయ భవనం. టౌన్ హాల్, పాత మున్సిపల్ కార్యాలయ భవనాలు ఎక్కడ ఉన్నాయి అనేది సంబంధిత అధికారులకు, పాత నగరం ప్రజలకు మాత్రమే తెలుస్తుంది. దాదాపు 90 శాతం మంది ప్రజలకు ఇవి రెండు చారిత్రక కట్టడాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియదంటే ఆశ్చర్యం కలగక మానదు.

ఇక టౌన్ హాలు గురించి చెప్పాలంటే ఎంతో చరిత్ర ఉంది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో విశాఖపట్నం నుంచి పాల్గొన్న అనేకమంది పోరాట యోధులు, మేధావులు, కవులు నిత్యం టౌన్ హాలులోనే సమావేశాలు జరుపుకునేవారు. మహాత్మా గాంధీతో సహా అనేకమంది ప్రముఖులు టౌన్ హాల్ వేదికగా స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజలలో రగిలించడానికి కృషి చేశారు. మహాకవి శ్రీశ్రీ, పురిపండ అప్పలస్వామి, ఆరుద్ర వంటి మహాకవులు టౌన్ హాలు వేదికగా అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. ఎంఎస్.సుబ్బలక్ష్మి, ద్వారం వెంకటస్వామి నాయుడు వంటి సంగీత విద్వాంసులు వారి ప్రతిభను ఇదే భవనంలో ప్రదర్శించి నాటి సంగీత ప్రియులను అలరించారు. ఇతర ప్రముఖులు సి.రాజగోపాలాచారి, సర్వేపల్లి రాధాకృష్ణన్, సివి.రామన్, రవీంద్రనాథ్ ఠాకూర్ వంటి వారు టౌన్ హాలులో ఉపన్యాసాలు అందించారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన టౌన్‌హాల్ దాదాపు రెండు దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరింది. ఇదే భవనాన్ని ఆనుకొని పాత మున్సిపల్ కార్యాలయ భవనం కూడా ఉంది. ఇది కూడా ఒక చారిత్రక భవనమే. చారిత్రక వారసత్వ భవనాలగా గుర్తింపు పొందిన వీటి నిర్మాణం ఎంతో పురాతనమైనది, విశిష్టమైనది కూడా. టౌన్ హాలును 1904 మార్చి 8న అప్పటి జిల్లా కలెక్టర్ ఆర్‌హెచ్ క్యాంబెల్ ప్రారంభించారు.

ఇక పాత మున్సిపల్ భవనం 1931లో నిర్మించబడింది. విశాఖపట్నం మున్సిపాలిటీ ఎంతో పురాతనమైన వాటిలో ఒకటి. 1858లో పనిచేయడం ప్రారంభించింది. పట్టణం విస్తరణతో కొత్త భవనం అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో టౌన్ హాల్‌ను అనుకొని నిర్మించిన భవనంలోకి మున్సిపల్ కార్యాలయాన్ని మార్పు చేశారు. అప్పటినుంచి ఇది మున్సిపల్ కార్యాలయ భవనంగా గుర్తింపు పొందింది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన తొలి మున్సిపల్ కార్యాలయ భవనం ఇదే. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ భవనాలు ఆ తర్వాత శిథిలావస్థకు చేరాయి. అయితే వీటిని చారిత్రక భవనాలుగా గుర్తించి జివిఎంసి వీటి పునరుద్ధరణకు నడిపించింది. 2020లో ఈ రెండు భవనాలను సుమారు రూ.15 కోట్లతో పునరుద్ధరించారు. వీటి పురాతన ఔన్నత్యాన్ని కాపాడుతూ, అప్పటి నిర్మాణాలు ఏమాత్రం చెక్కుచెదరకుండా వీటిని నిర్మాణం జరిగింది. అయితే ఇది జరిగి రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ వీటిని ఈనాటికీ నిర్వహణలోకి తేలేదు. దీంతో నిర్వహణా లోపాలు తలెత్తి మళ్లీ శిథిలదశకు చేరే అవకాశముందని పలువురు భావిస్తున్నారు.